# చుట్టుపక్కల చూడరా!

– కర్లపాలెం హనుమంతరావు



సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

*9*

## అకాలగర్జిత దోష నివారణ మంత్రం.

"**ఏంటి బాబాయ్... ఇంటికి మరమ్మత్తులా?** అన్ని లక్షలు పోసి మొన్ననేగా కట్టించావ్?! అప్పుడే ఇట్లా మెయిన్ గేటే మూయించేస్తున్నావేంటి?! నీకూ టైం బాగోలేదా ఏంటీ?"

"వెటకారమొద్దు! పడేవాడికి తెలుస్తుందిరా దెబ్బ బాధ. నిన్నటిదాకా నేనూ ఏదో తమాషాగా తీసుకున్నా గానీ.. బొప్పికట్టింతరువాత గానీ ఇప్పుడు నొప్పి తెలీటంలేదు. టైం బాగోలేకపోతే ఎంతలావు సింహమైనా సింహద్వారం నుంచీ రాలేదురా అబ్బాయ్! వెనకాల ఏ కలుగో చేయించుకుని ఎలుకలాగా వచ్చిపోతుండాల్సిందే.. వాస్తు అంటే ఇప్పుడు తెలిసొచ్చిందిరా బాబూ!"

"ఫో బాబాయ్.. నువ్వు కూడా మరీ ఇలా తయారయ్యావ్ ఏంటి? అప్పుడన్నీ వాస్తు చూసుకునే కదా కట్టించుకున్నావ్?! ఈశాన్యంలో పూజగదీ.. దక్షిణంలో పడగ్గదీ.. పడమర భోజనాలగదీ.."

"నిజమేరా నాయనా! అన్నీ చూసుకున్నాగానీ.. 'ఆ డబ్బా దస్కం' ఏ మూల కుక్కాలో ఏ వాస్తుపండితుడూ చెప్పలేదప్పుడు. ఇప్పుడు దానితోనే ముప్పొచ్చి చచ్చింది. ఏ క్షణంలో ఏ సిబిఐ వాడో ఈడోవాడో ఎటునుంచొచ్చి పడతాడోనని గుండెలు దడదడలాడిపోతున్నాయి. దినదినగండం నూరేళ్ళాయుష్షులాగా ఇట్లా క్షణం క్షణం వణికి చచ్చేకన్నా. అయితే అయింది. ఖర్చులో ఖర్చని.. ఇట్లా మరమత్తులకు దిగానులే! ఇంకింతకన్నా ఇప్పట్లో విడమరిచి చెప్పడం నావల్ల కాదు. గోడవతలనుండీ ఏ మీడియావాడో వింటే మొదటికే మోసం వస్తుంది. అసలే నా టైం బాగోలేదు"

"నీకనే ఏంటిలే బాబాయ్.. లోకానికే రోజులు బాగాలేవు. అంతంత గొప్పలు పోయే అమెరికావాడికి తప్పాయా తిప్పలు? ఎప్పుడో ఎవరో చేసి పేరబెట్టిన అప్పులు ఇప్పుడు కాలికింద నిప్పుల్లా కథాకళి చేయించటంలా!. నువ్వే ఇలా అంటే మరా ఒబామా గారు పాపం ఏమనుకోవాలి! అంత సాహసం చేసి బిన్ లాడెన్ని సఫాచేసిన సంతోషం నెలరోజులు కూడా మిగలలేదు. నెత్తిమీద మరో మాంద్యం పిడుగొచ్చి పడింది. మరాయనా నీకు లాగా ఆ వైట్ హౌసు గోడలకి వేరే రంగులేయిస్తూ కూర్చోవాలా! లీకయిపోతున్నాయని అణురియాక్టర్ల ప్లాంట్లకు జపానువాడు శాంతులూ హోమాలూ చేయించాలంటావా ఏంటి కొంపతీసి? నీ లెక్కన ఆ ఈజిప్టు ముబారక్ లూ, పాకిస్తాను ముష్రాఫ్లూ మన ఇండియా వచ్చి చండీయాగాలు గట్రా చేయించకపోబట్టే మృత్యుగండం ముంచుకొచ్చిందనేట్లున్నావే!"

"తప్పేముందిరా! ఎక్కడెక్కడి వాళ్ళ గోలో ఎందుగ్గాని. దుబాయ్‌లో మహారాజాలాగా వెలిగిపోయే ఆ ఎమ్మార్ కంపెనీ వాళ్ళు ప్రపంచంలోనే ఎత్తైన 'బుర్జ్ అల్ ఖలీఫా' కట్టినప్పుడు రాని తిప్పలు.. ఇప్పుడు.. ఇండియాలో మన రాష్ట్రంలో నాలుగెకరాల భూమిలో పదివిల్లాలు కట్టిపెట్టే పనికే ఎంతగా విలవిల్లాడిపోతున్నారో చూడు. ఆ అల్ ఖైమారస్ వాళ్ళకు పోర్టులు కట్టటమేమన్నా కొత్తవిద్యా? మన 'వాడరేవు - నిజాం పట్నం' రొంపిలో పడి గిలగిలలాడిపోతున్నారు! అసలు మన దక్షిణాదికే ఏదో శని పట్టుకున్నట్లుందిరా! కర్నాటకలో ఏవో ముష్టి 'పదికోట్లు ముడుపులుగా పుచ్చుకున్నందుకే.. పాపం ఆ యడ్యూరప్పకు ఎంత ఏడుపు మిగిలిందో నీ కళ్ళతోనే నువ్వు చూడు! అన్నేళ్ళ బట్టి మద్దతిస్తున్నాడని కూడా కరుణ చూపకుండా కరుణానిధిగారినీ ముదివయసులో కేంద్రం ఎలా క్షోభపెడుతుందో తలుచుకుంటేనే గుండె ఒక వంక తరుక్కుపోతూ ఉంది.. మరొవంక గుడగుడలాడుతూ ఉంది. అంత అనంత పద్మనాభస్వామి వారి సంపదకే కాళ్ళొచ్చే ప్రమాదమేర్పడగా లేనిది మానవ మాత్రులం మనబోటివాళ్ళు కడుపుకొట్టో, కాళ్ళు పట్టో పోగేసుకున్న ముష్టి నాలుగు రాళ్ళకు కాళ్ళు మొలిస్తే.. ముందు మీ పిన్నే తట్టుకోలేదురా! ఉద్యోగం చివరిరోజులు గదా!.. అని.. ఎంతవేగంగా చురుగ్గా..... ఈ ఆస్తులు సంపాదించానూ! అంతకన్నా వేగంగా ఈ నిందలూ, నేరారోపణలూ, విచారణలూ దాడులూ.. ఇదంతా ఏదో నా కర్మ ప్రారబ్ధమే!"

"బాబాయ్! నాలుగురోజుల బట్టి అన్ని పత్రికల్లో టీవీల్లో ఆ సిబిఐ వాళ్ళ ప్రాథమిక సమాచార నివేదిక వస్తూనే ఉంది. ఆ పాతిక తక్కువ కౌరవుల గుంపులో నీ పేరు నాకెక్కడా కనిపించలేదే! నువ్వెందుకింత ఆందోళన పడుతున్నావో అర్ధంకాకుండా ఉంది! నీ వాలకం చూస్తుంటే అన్నం నీళ్ళూ మానేసిన ఆ అన్నాహజారే గారికన్నా నువ్వే రెండో మూడో కిలోల బరువు తగ్గినట్లున్నావ్. ఎవరి ఖాతాలో స్థంభిస్తే.. నీకెందుకింత కంగారూ?! ఒక వంక ఎన్ని ఆరోపణలొచ్చి పడుతున్నా చెక్కుచెదరకుండా ఓదార్పు యాత్రలంటూ ఊళ్ళ వెంటబడి తిరుగుతున్నాడు నెంబర్ వన్. లక్షలూ కోట్లూ లడ్డూల్లాగా పంచుకుని దాచుకున్న పెద్ద పెద్దవాళ్ళే అంత ధైర్యంగా ఎదురు దాడులూ, చేస్తుంటే.. నువ్వేంటి బాబాయ్.. స్వైన్ ఫ్లూ తగులుకున్న రోగిమాదిరిగా.. మొహం కూడా కనిపించకుండా ముసుగేసుకుని.. చీకట్లో ఇట్లా. ఇంటిగోడలు పగలకొట్టిస్తున్నావ్? అన్నన్ని కోట్లు మింగిన ఆ టూజీ రాజాను చూసైనా ధైర్యం తెచ్చుకోరాదా? అంత నిజంగానే ఏదన్నా కొంపమీదకొచ్చి పడితే అప్పటికేదో ఉపాయం తట్టకుండా ఉంటుందా? ఆ కల్మాడీ లాగా ఏదన్నా మతిమరుపులాంటి కొత్త చిట్కానో పుట్టుకొస్తుందిలే బాబాయ్! ఇప్పటి నుంచే ఇలా చడీ చప్పుడు కాకుండా రాత్రిళ్ళు ఇలా పలుగులూ పారలూ పట్టుకుని తిరుగుతుంటే... చుట్టుపక్కల వాళ్ళకి నీ అంతట నువ్వే ఉప్పందించినట్లవదూ! ముందీ వాస్తుమార్పులు మానెయ్!"

"అలాక్కాదురా బాబూ! ముందు నేనూ నీకులాగే బిగువుగానే ఉందామనుకున్నానుగానీ... కుదిరేట్లు లేదు. పూజాది మీదపెట్టిన శ్రద్ధ పడగ్గదిమీద పెట్టుకోకబట్టేగదా.. స్వామి నిత్యానందకు అన్ని తిప్పలొచ్చాయి. తీహార్ జైల్లో కూతుర్ని కనీసం ఉత్తరం వైపు సెల్లో పెట్టించే ఏర్పాటైనా కరుణానిధి చేయకపోబట్టే బెయిలు దొరకడం కూడా కష్టంగా ఉందంటున్నారు వాస్తు పండితులు. చాదస్తం అని మనం ఊరికే వెక్కిరించుకుని సరదా పడతాంగానీ. లక్షలూ.. కోట్లూ కుమ్మరించి తీసిన చిత్రానికి కూడా అక్షరం విషయంలో సినిమా వాళ్ళూరికే ఎందుకు అంత పట్టు పడతావు? మొన్న బాబాయి, నిన్న మంత్రులు, పొద్దున సోనియా సలహాదారు, మధ్యాహ్నం సిబిఐ, సాయంత్రం చివరికి న్యాయస్థానం పేరు కూడా లాగుతున్నారుగదా రొంపిలోకి! రేప్పొద్దున్నే ఎవరి పేరు కొత్తగా బైటపడుతుందోనని నాకు బెంగగా ఉందిరా!"

"ఊరికే కంగారు పడి ఈ మరమ్మత్తులు చేయద్దులే బాబాయ్! మీ నేత చెప్పనే చెప్పాడుగా.. పైనుంచీ దేవుడు అంతా చూస్తున్నాడని అధర్మానికి తప్పకుండా శిక్షపడుతీరుతుంది. బాధపడద్దు!"

"అదే కదురా బాబూ మొదటి నుంచీ నాగోల! పైన చల్లంగా కళ్ళుమూసుక్కూర్చున్న దేవుణ్ణి కూడా ఈ రొంపిలోకి దింపారు - చివరికి అంతా కలిసి. సిబిఐ వాళ్ళ జాబితా చివర్లో 'ఆ'గుర్తు తెలియని వ్యక్తుల పేర్లలో నాపేరు కూడా కనిపించకుండా ఉండాలంటే తెల్లారేలోపల ఈ ఇంటికి మరమంత్తులు జరిగిపోవాల్సిందే! డబ్బుపోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు. ఖాతా పుస్తకాలు, కంప్యూటర్ హార్డ్

డిస్క్‌ల్లో ఎంత తొలిగించినా తిరిగి సమాచారం రాబట్టే సౌకర్యం ఉందంటగా! అందుకే ఈ గోడల్లో పెట్టించి.. భారతి సిమెంట్‌తో గట్టిగా దిమ్మిశ చేయించాలనే నిర్ధారణేసి మరీ మరమ్మత్తులు చేయిస్తుంది. వాస్తు శర్మగారు చెప్పిన 'అకాలగర్జిత దోషాని'కి ఇదొక్కటే ఏకైక నివారణ మంత్రం.

Post your comments